సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 21 । నవంబర్ । 2024



వేడుకగా సారె ఊరేగింపు జిల్లా కేంద్రం పాడేరులో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పట్టణ పురవీధుల్లో మహిళలు సారె ఉరేగింపు నిర్వహించారు. అనంతరం గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. –సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న రంపచోడవవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

దేవీపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ కోరారు. బుధవారం ఇందుకూరుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. అనంతరం యంత్రాలతో వరి కోతలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ విశ్వనాథచౌదరి, తహసీల్దార్ సత్యనారాయణ, డీవో ప్రశాంతి, సివిల్ సప్లయి అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జెన్‌కో సీఈకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మోతుగూడెం: ఏపీ జెన్‌కోలో ఇరవై ఏళ్లుగా పని చేస్తున్న వారికి నేరుగా జీతాలు చెల్లించాలని, అర్హతను బట్టి వారిని పర్మినెంట్ చేయాలని సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మోతుగూడెంలో ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ జెన్‌కో పనిచేస్తున్న కార్మికులను పనిని బట్టి స్కిల్, సెమీ స్కిల్డ్‌గా పరిగణించి జీతాలు చెల్లించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఏపీ జెన్‌కో క్వార్టర్లపై అద్దె ప్రతిపాదికను ఇప్పించాలని కోరారు. జెన్‌కో ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రీజనల్ కార్యదర్శి రత్నాకర్, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పీవో సింహాచలం పర్యటన



గిరిజనులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

మారేడుమిల్లి: వై.రామవరం, మారేడుమిల్లి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం బుధవారం పర్యటించారు. కానివాడలో గిరిజన యువతతో మాట్లాడారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, గ్రామ రహదారికి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల వివరాలను తెలుసుకున్నారు. గిరిజనులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. బంద ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అనారోగ్యంగా ఉంటే దగ్గరలోని పీహెచ్‌సీకి తరలించాలన్నారు. బోదులూరు ఆశ్రమపాఠశాల, సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది గ్రామాలకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

అమెరికన్ వీసా కోసం దళారులను నమ్మకండి

కొమ్మాది(విశాఖ): అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చే యువతలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారని, అయితే వీసా కోసం దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం కాన్సులర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ విభాగాధిపతి ఎస్.జెన్నె సూచించారు. గీతం డీమ్డ్ వర్సిటీలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో అమెరికాలో ఉన్నత చదువులకు వీసా పొందే విధానంపై ఆమె అవగాహన కల్పించారు. అమెరికాలో 4,500 గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో ప్రవేశానికి ఆసక్తి గలవారు తమ కాన్సులేట్ కార్యాలయంలో ఎఫ్–1 విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో వీసా పొందాలనుకుంటే భవిష్యత్తులో అమెరికాలో ప్రవేశానికి శాశ్వతంగా మార్గాలు మూసుకుపోయినట్లేనని హెచ్చరించారు.

మంచి ఆదాయం పొందుతున్నా..



చేపలు, రొయ్యలతో పచ్చళ్లు, అప్పడాలు వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పందిరిమామిడి కృషి విజ్ఞానకేంద్రంలో 2023లో శిక్షణ పొందా. ఆ తరువాత సొంతంగా విలువఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రారంభించా. ప్రతీ నెల సుమారు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టి చేపలు, రొయ్యలతో పచ్చళ్లు తయారు చేస్తున్నా. తన వద్ద కొంత మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.పెట్టుబడి పోను నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌లో విక్రయించే అవకాశం కల్పించారు.

– సీహెచ్ శ్రీదేవి, గిరిజన మహిళ, రంపచోడవరం

- నాడు అటవీ ఉత్పత్తులే ఆధారం
- నేడు చెరువులు, జలాశయాల్లో చేపల పెంపకం
- సహకారం అందిస్తున్న శాస్త్రవేత్తలు
- ఉచితంగా విత్తన పిల్లలు, దాణా పంపిణీ
- అనుకూల వాతావరణ పరిస్థితులతో మంచి దిగుబడి, ఆదాయం
- విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేస్తూ ఆర్థికాభివృద్ధికి బాటలు

ఒకప్పుడు గిరిజనులు అటవీ ఉత్పత్తులపై ఆదాయం పొందేవారు. స్థానికంగా వాగులు, గెడ్డల్లో చేపల వేట సాగించగా వచ్చే అరకొర ఆదాయంతో కాలం గడిపేవారు. ఇప్పుడు వారిలో పూర్తిగా మార్పు కనిపిస్తోంది. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం అందించే ప్రోత్సాహంతో స్థానికంగా అందుబాటులో ఉన్న జలవనరుల్లో మత్స్య పెంపకం చేపట్టి మంచి ఆదాయం పొందుతున్నారు. చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి విక్రయించే స్థాయికి మత్స్యకార మహిళలు ఎదుగుతూ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు. నేడు ప్రపంచ మత్స్య దినోత్సం సందర్భంగా...

జలవనరుల్లో మత్స్యసిరులు

కేవీకే సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న గిరిజన మత్స్యకారులు

రంపచోడవరం డివిజన్ సమాచారం	
గిరిజన మత్స్యకార సంఘాలు	15
చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు	2
పంచాయతీ చెరువులు	18
సాగునీటి చెరువులు	15
జలాశయాలు	5



రొయ్యలను చూపిస్తున్న గిరిజన మత్స్యకారుడు



జలాశయంలో పట్టిన చేపలతో గిరిజన మత్స్యకారులు, పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



చెరువులో పట్టిన చేపలు

రంపచోడవరం: చేపలు, రొయ్యల పెంపకంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి గిరిజన మత్స్యకారులు మంచి ఆదాయం పొందుతున్నారు. స్థానికంగా ఉన్న సాగునీటి చెరువులు, భూపతిపాలెం, ముసురుమిల్లి, సూరంపాలెం, మద్దిగెడ్డ, దెమ్మలగుమ్మి జలాశయాల్లో వీటి పెంపకం చేపట్టి వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. వీరికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలోని మత్స్య విభాగం అందజేస్తోంది.

- భూపతిపాలెం, ముసురుమిల్లి రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ ద్వారా బొచ్చ, రవ్వ, మోస, ఫంగస్ రకం చేపల పెంపకం చేపట్టి గిరిజన మత్స్యకారులు ఫలితాలు సాధించారు. ఈ ఏడాది ఆరు టన్నుల మేర చేపలను ఉత్పత్తి చేశారు. స్థానికంగానే విక్రయించి మంచి ఆదాయం పొందారు.
- కేవీకే సహకారంతో మొదటిసారిగా మంచినీటి రొయ్య పిల్లల పెంపకాన్ని మూడేళ్ల క్రితం ఈ ప్రాంతంలో చేపట్టారు. సిఫా విడుదల చేసిన మంచినీటి రొయ్య రకం మంచి దిగుబడి వచ్చింది. కిలోకు 10 కౌంట్ (పది రొయ్యలు) వచ్చినట్టు కేవీకే మత్స్యవిభాగం అధికారవర్గాలు తెలిపాయి. ఎకరాకు 500 నుంచి 600 కిలోలు దిగుబడి రావడంతో గిరిజన మత్స్యకారులు మంచి ఆదాయం పొందారు. గత మూడేళ్లలో ఏడాదికి 40 వేల చొప్పున 1.20 లక్షల రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేశారు.
- మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న కొరమేను చేపల పెంపకంలో కూడా మంచి ఫలితాలు సాధించారు. వీటిని వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో కేవీకే ప్రోత్సహించింది. మొదటి సారిగా అమూర్ కార్ఫ్‌రకం పెంపకం చేపట్టారు. సాధారణం రకం కంటే 25 శాతం పెరుగుదల వచ్చింది.
- చేప పిల్లల విషయానికొస్తే 2022లో 60 వేలు, 2023లో 70 వేలు, 2024లో 1.50 లక్షలు కేవీకే ఉచితంగా పంపిణీ చేసింది.
- చేపలు, రొయ్యల పెంపకంపై ఏమాత్రం అవగాహన లేని గిరిజన మత్స్యకారులకు పందిరిమామిడి కృషి విజ్ఞానకేంద్రం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మూడేళ్లలో వెయ్యి మందికి 30 శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసింది. వీటిలో చేపలు, రొయ్యల పెంపకంలో యాజమాన్యం, ఆదాయ వివరాలపై ఇప్పటికే వారు అవగాహన పొందారు. ఏటా చేపల వల వలలు పంపిణీ చేయడంతోపాటు పోషక విలువలతో కూడిన దాణాను ఉచితంగా అందజేస్తోంది.
- చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై గిరిజన మత్స్యకార మహిళలు పందిరిమామిడి కేవీకేలో శిక్షణ పొందారు. పచ్చళ్లు, చేప కట్‌లెట్స్, ఒడియాలు, చేప బాల్స్, మురుకులు, అప్పడాలు, సమోసా, ఫిష్ ఫింగర్లు తయారు చేసే స్థాయికి ఎదిగారు. నెలకు రూ.25 నుంచి రూ.35 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

అధిక దిగుబడి సాధించా



కేవీకే శాస్త్రవేత్తలు మత్స్యకార గిరిజన రైతులకు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ ఏడాది కొత్త రకాల చేప పిల్లలను అందజేశారు. వీటి పెంపకాన్ని శ్రద్ధగా చేపట్టడంతో అధిక ఉత్పత్తిని సాధించగలిగా. చేపలు పెంపకానికి మేతను కూడా అందిస్తున్నారు. రైతులకు వద్దకు వచ్చి చేపల పెంపకంలో మెళకువలు చెబుతున్నారు. మంచి ఆదాయం పొందేందుకు అవసరమైన సమాచారం అందిస్తున్నారు.

– **నంద మురళీకృష్ణ**, చెరువుపాలెం, రంపచోడవరం మండలం

పెంపకానికి ఎంతో అనుకూలం



ఏజెన్సీలో మంచి నీటి లభ్యత, సారవంతమైన భూమి ఉన్నందున చేపల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంది. గిరిజన మత్స్యకారులు చేపల పెంపకంలో అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మంచి మార్కెటింగ్ ఉన్నందున బాగా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఆసక్తి గల రైతులు పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలోని తమ విభాగాన్ని సంప్రదించాలి.

– **కె. వీరాంజనేయులు**, మత్స్యశాఖ శాస్త్రవేత్త, పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం

సీలేరులో సీ ప్లేన్ సర్వీసుపై సర్వే

- గుంటవాడ జలాశయాన్ని పరిశీలించిన తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు
- కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడి



సీలేరులో గుంటవాడ జలాశయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ , ఇరిగేషన్ అధికారులు

సీలేరు: పర్యాటక అభివృద్ధిలో భాగంగా సీలేరులో శ్రీశైలం తరహాలో సీ–ప్లేన్(నీటిపై తేలియాడే విమానం) ప్రయాణాన్ని అందుబాటులో తీసుకువచ్చేందుకు సర్వే మొదలయ్యింది. ఇందుకు జిల్లాలోని సీలేరు (గుంటవాడ రిజర్వాయర్) అనుకూలమా? కాదా? అన్న అంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గూడెంకొత్తవీధి తహసీల్దార్ టి.రామకృష్ణ, ఇరిగేషన్ బృందం మారెమ్మతల్లి ఆలయ స్నానాల ఘాట్ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2017లోనే ఈ రిజర్వాయర్‌లో సీ–ప్లేన్ టేకాఫ్, ల్యాండింగ్ అనుకూలతను అధికారులు గుర్తించారన్నారు. టేకాఫ్, ల్యాండింగ్‌కు 300 మీటర్ల మట్టి రోడ్డు, ఫ్లోటింగ్ జెట్టీ సరిపోతుందన్నారు. సీ–ప్లేన్ ప్రయాణానికి సీలేరు అనుకూలమని కలెక్టరుకు నివేదిక ఇస్తున్నట్లు తెలిపారు. జోలాపుట్‌లో కూడా ఈ తరహా ప్రయాణానికి సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సీలేరులో సీ–ప్లేన్ సర్వీసులు ప్రారంభమైతే సీలేరు నుంచి వైజాగ్ మధ్య ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

క్రీడల్లో సత్తా చాటాలి



విజృంభిస్తున్న చలిగాలులు



- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

8లో

సమస్యలు పరిష్కరించాలి



పాడేరులో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు



చింతూరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

- వీవోఏల డిమాండ్
- పాడేరు, రంపచోడవరంలో ఆందోళన

సాక్షి,పాడేరు: సమస్యలు పరిష్కరించాలని వీవోఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు జేయాలని, ఉపాధి కోల్పోయిన వీవోఏలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని జేసీ అభిషేక్ గౌడ్‌కు అందజేశారు. సీఐటీయూ ప్రతినిధులు రాజ్‌కుమార్,ఎస్‌బీ పోతురాజు.అధిక సంఖ్యలో యానిమేటర్లు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు ధర్నా చేశారు. నిర్వహించారు.సీఐటీయూ కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ , ఉపాధ్యక్షుడు కె శాంతిరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం ఏపీవో డీఎస్‌వీ రమణకు వినతి పత్రం అందజేశారు.

చింతూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్లోని వీవోఏలు స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, పొడియం లక్ష్మణ్, గౌర్రె లక్ష్మయ్య, దూలమ్మ, దుర్గాదేవి, శ్రీను, లీలావతి, కొండమ్మ, జ్యోతి, రత్నకుమారి పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ

సీలేరు: తప్పుడు కులధ్రువీకరణ పత్రాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టమని జీకేవీధి ఆర్ఐ మహదేవ్ తెలిపారు. సీలేరు సచివాలయంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు నలుగురు పొందారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ దుర్గో, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్ సమక్షంలో బుధవారం ఆయన విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని ఆ నలుగురికి సూచించినట్టు ఆర్ఐ తెలిపారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక సమర్పిస్తామని ఆయన వివరించారు.

24న జిల్లాస్థాయి భజన పోటీలు

చింతపల్లి: మండల కేంద్రమైన చింతపల్లిలో ఈ నెల 24న జిల్లాస్థాయి భజన పోటీలు ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు విజయకుమార్,అశోక్ తెలిపారు. ధాన ధర్మ చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. జిల్లాలోని 22 మండలాలకు చెందిన వారు పాల్గొనవచ్చన్నారు. చౌడుపల్లి, రత్నగిరి కాలనీ వారి సహకారంతో చింతపల్లి మార్కెట్‌యార్డులో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ఇస్తామన్నారు.ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. ఆసక్తి గల భజన బృందాల సభ్యులు 9392002994, 9392461202లో సంప్రదించాలని కోరారు.

అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థిని మృతి



పల్లవి (ఫైల్)

జి.మాడుగుల: అనారోగ్యంతో బాధపడుతున్న కస్తూర్బా విద్యార్థిని విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో మోదకొండమ్మ, తల్లి జ్యోతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోరాపల్లి పంచాయతీ వనల్బ గ్రామానికి చెందిన బట్టి జ్యోతి కుమార్తె పల్లవి జీఎం కొత్తూరులోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. చాలాకాలంగా ఆమె పాఠశాలకు రాకపోవడంతో కుటుంబ సభ్యులను ఫోన్‌లో ఉపాధ్యాయులు సంప్రదించారని ఇన్‌చార్జి ఎస్‌వో తెలిపారు. ఆరోగ్యం బాగులేదని వారు చెప్పడంతో కేజీబీవీ ఉపాధ్యాయులు ఈనెల 7న వనల్బలోని విద్యార్థిని పల్లవి ఇంటికి వెళ్లారన్నారు. ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించాలని తల్లికి చెప్పి వచ్చారని ఆమె వివరించారు. ఈమేరకు పల్లవిని ఆమె తల్లి ఈనెల 8న స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి, తరువాత విశాఖ కేజీహెచ్‌కు తరలించింది. ఈ నేపథ్యంలో అక్కడ పల్లవి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఇన్‌చార్జి ఎస్‌వో, కుటుంబ సభ్యులు తెలిపారు.





800 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో విజేతలు అంకిత, అమృత, మౌనిక, బాలుర విభాగంలో విజేత కిరణ్



పోటీల్లో లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

ఉత్సాహంగా ‘ఏకలవ్య’ క్రీడా పోటీలు

అరకు ఏపీ గురుకుల క్రీడా పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి 4వ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గురుకులం కోఆర్డినేటర్, అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించిన ఈ పోటీలను గురుకులం ఓఎస్డీ రఘునాథ్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల నుంచి 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

8లో

క్లుప్తంగా

108లో సుఖ ప్రసవం



శిశువును చూపిస్తున్న ఈఎంటీ లోకేష్

పాడేరు : ప్రసవానికి ఇబ్బందులు ఎదురై అత్యవసరంగా విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తున్న ఓ నిండు గర్భిణికి 108 సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. పెదబయలు మండలం రూడకోట గ్రామానికి చెందిన కె.కుంచలమ్మ అనే మహిళ నిండు గర్భిణీ. పురిటి నొప్పులు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకు తరలించారు. అక్కడ ఆమె ప్రసవానికి ఇబ్బందులు ఎదురవడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కానీ ప్రసవానికి మరింత ఇబ్బందులు ఎదురైంది. అత్యవసరంగా విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు వైద్యులు సూచించారు. దీంతో 108 వాహనంలో విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో వద్దాది వద్ద ఆమెకు పురిటి నొప్పులు అధికమవడంతో వాహనాన్ని రహదారి పక్కకు నిలుపుదల చేశారు. ఈఎంటీ లోకేష్, పైలెట్ లక్ష్మి గణపతి ఆమెకు సుఖ ప్రసవం చేశారు. దీంతో ఆమె పండంటి మగబిడ్డను జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. తల్లి, బిడ్డను అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రి నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో చేర్చారు. సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బందికి తల్లీ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

కొయ్యూరు: మండలంలోని చింతలపూడిలో నివాసముంటున్న పుట్ట సత్యనారాయణ తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. గ్రామంలో బుధవారం జరిగిన ఘటనలో బాధితుడు సత్యనారాయణ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయాయని బాధితుడు కన్నీరు మున్నీరవుతున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు 4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'ఏకలవ్య' క్రీడా పోటీలు



మాట్లాడుతున్న గురుకులం ఓఎస్డీ రఘునాథ్



జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన డేవిడ్‌కు సత్కారం



వాలీబాల్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు

అరకులోయ టౌన్ : స్థానిక ఏపీ గురుకుల క్రీడా పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి 4వ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గురుకులం కోఆర్డినేటర్, అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించిన ఈ పోటీలను గురుకులం ఓఎస్డీ రఘునాథ్ ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, కోకో, ఆర్చరీ, బ్యాడ్మింటన్, చెస్, జూడో, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, జావలిన్ త్రో, పోలో వాల్ట్, త్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్, రన్నింగ్ 800, 1500, 4000 మీటర్ల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో గురుకులం కోఆర్డినేటర్, అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురుకులం అసిస్టెంట్ సెక్రటరీ హరి, అరకులోయ ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు, ఈఎంఆర్ఎస్ ప్రిన్స్‌పాళ్లు, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

డేవిడ్‌కు అభినందన

● ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ జూనియర్ మ్యూజిక్ కల్చరల్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన అనంతగిరి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి మాస్టర్ సానాయి డేవిడ్, తండ్రి కామేశ్వరరావును గురుకులం ఓఎస్‌డీ రఘునాథ్ జ్ఞాపిక అందజేసి సత్కరించారు. డేవిడ్‌ను ఈఎంఆర్ఎస్ ప్రిన్స్‌పాళ్లు అభినందించారు.

విజేతలు వీరే : 800 మీటర్ల పరుగు పందెం బాలుర విభాగంలో చింతూరు ఈఎంఆర్ఎస్‌కు చెందిన కిరణ్ ప్రథమ స్థానం, అనంతగిరి ఈఎంఆర్ఎస్‌కు చెందిన రాఘవ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో చింతూరుకు చెందిన అంకిత, అమృత, మారేడుమిల్లికి చెందిన మౌనిక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

క్రీడల్లో సత్తా చాటాలి

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- పాడేరులో అంతర్ జిల్లాల థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ప్రారంభం

పాడేరు : విద్యార్థుల ప్రాథమిక దశ నుంచి క్రీడలపై మక్కువ పెంచుకుని సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తేవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ అండర్ 14,17,19 అంతర్ జిల్లాల థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లాల పోటీలు పాడేరులో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ రిఫరీ సూరిబాబు, థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, లైజింగ్ అధికారి ఆర్‌కేడీ ప్రసాద్, స్టూడెంట్ ఇంటర్నేషనల్ కోఫ్‌కన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు, సుటోఖాన్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కోచ్ రాజేశ్వరరావు, సుమన్ సుటోఖాన్ కరాటే అసోసియేషన్ ఇన్‌స్ట్రక్టర్ నందకదొర రామారావును ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. ఈ పోటీల్లో 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, పీడీలు భూపతిరాజు, కొండబాబులతో పాటు పలు జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వంజంగిలో సక్రమంగా పారిశుధ్య పనులు

డీఎల్‌పీవో కుమార్



అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

పాడేరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగిలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ ఆదేశించారు. ఆయన బుధవారం సాయంత్రం వంజంగిలో పర్యటించారు. అక్కడ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో, ఈఓపీఆర్డీ తరచుగా వంజంగిని సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ప్రతి రోజు తొలగించాలని, పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వంజంగిలో రిసార్ట్స్, టెంట్లు నిర్వహిస్తున్న యజమానులు విడిది చేసే పర్యాటకుల నుంచి విధిగా గుర్తింపు కార్డులు సేకరించాలని ఆదేశించారు. ప్రతి రిసార్ట్‌లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో డేవిడ్‌రాజు, ఈఓపీఆర్డీ రమేష్ తదితరులున్నారు.

19 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని తూకం వేస్తున్న ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ కొత్తూరు జంక్షన్ వద్ద బుధవారం తరలిస్తున్న 19.470 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై పక్కా సమాచారంతో పోలీసులు కొత్తూరు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. బైక, ఆటోలో వస్తున్న నిందితులు పోలీసులను చూసి రెండు బస్తాలను విడిచిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, వీఆర్వో సమక్షంలో తూకం వేశారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు పంచాయతీ ముసిగూడ గ్రామానికి చెందిన పాడు మజ్జి, కొర్రాపుట్టు జిల్లా నందపూరు బ్లాక్ పాడువా పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన కిల్ల మధు, అల్లూరి జిల్లా అరకువేలి మండలం పెదలబుడు పంచాయతీ తాంగులగూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాంగుల పరుశురామ్, డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన గడ్డంగి సోమరాజులు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని, మూడు సెల్‌ఫోన్లు, రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులపై, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరో నిందితుడి వివరాలు సేకరిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొండలు ఎక్కి.. గెడ్డలు దాటి

- మోతుగూడెం శివారు నేలకోట గ్రామాన్ని సందర్శించిన చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్
- సమస్యల పరిష్కారానికి హామీ



నేలకోట గ్రామం నుంచి మోతుగూడెం కొండ కాలువ దాటి వెళ్తున్న పీవో అపూర్వ భరత్



అటవీ మార్గంలో వెళ్తున్న పీవో అపూర్వ భరత్

మోతుగూడెం: అడవి మార్గంలో కాలినడకన కొండలు ఎక్కి...గెడ్డలు దాటి శివారులో ఉన్న నేలకోట గ్రామాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ బుధవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామానికి కొన్నేళ్లుగా ఉన్నతాధికారులు ఎవరూ రాలేదని... సమస్యలతో సతమతమవుతోనే జీనవం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి మోతుగూడెం వరకు రోడ్డు నిర్మించాలని వేడుకున్నారు. రవాణా సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే నేలకోట గ్రామం నుంచి గొడ్లగూడెం పీహెచ్‌సీకి వెళ్లేందుకు 16 కిలోమీటర్లు, మోతుగూడెం పీహెచ్‌సీకి వెళ్లాలంటే ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. మోతుగూడెం వరకు రోడ్డు నిర్మాణంతో సమస్య పరిష్కారమవుతుందని గిరిజనులు వివరించారు. అనంతరం ఆయన తిరుగు ప్రయాణంలో కాలినడకను వెళ్తున్న పీవోను ఎంపీటీసీ సభ్యుడు వేగి నాగేశ్వరరావు కలిశారు. నేలకోటలో సమస్యలతో పాటు రహదారి నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. మోతుగూడెంలోని ఎస్టీ కాలనీలో గిరిజనులతో సమావేశమయ్యారు. పీవోకు పలు సమస్యలను వివరించారు. గ్రామంలోని సుమారు 60 ఎకరాల్లో పంటలకు సాగునీరు అందించేందుకు మోటార్ ఇచ్చారని, ప్రస్తుతం పనిచేయడం లేదని స్థానికులు సమస్యను విన్నవించారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను స్థానిక మహిళలు వివరించారు. మురుగునీరు రహదారులపై పారుతోందని, దుర్గంధంతో సతమతవుతున్నామని, వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



గెమ్మెలిలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకుంటున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



గెమ్మెలి ఆస్పత్రిలో ల్యాబ్, ఫార్మసీలను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

- తాగునీటి సమస్య పరిష్కరిస్తాం
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్పష్టం చేశారు. మండలంలో గెమ్మెలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ ఆశ్రమ పాఠశాలలో 9, 10తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సోషల్ పాఠ్యాంశాలను ఆయన బోధించారు. విద్యార్థులు ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో సామర్థ్యాలను మెరుగుపర్చాలని ఉపాధ్యాయులను ఆయన ఆదేశించారు. మెనూ అమలుతీరుపై ఆయన ఆరా తీశారు. ప్రతీ రోజు నిర్దేశించిన మెనూ సక్రమంగా నాణ్యమైన భోజనం అందజేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి ఎ,బి,సీ,డీ గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. సీ,డీ గ్రూపుల్లో విద్యార్థులు సామర్థ్యాలను మెరుగుపర్చటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్ జనరేషన్ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి ఆధార్, ఆపార్ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గెమ్మెలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీని అడిగి తెలుసుకున్నారు. లేబరేటరీ, ఫార్మసీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గెమ్మెలిలో తాగునీటి సమస్యను విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించి, గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్తపల్లి జలపాతాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనుల పురోగతి, తదితర విషయాలు ఆయన పరిశీలించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో మృతి చెందిన బాలసూర్యం



అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేంద్ర



బాల సూర్యం (ఫైల్)

అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట సమీప గన్నెల జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలం పెద్దబిడ్డ పంచాయతీ చెరుకుమడత గ్రామానికి చెందిన వంతల బాలసూర్యం (21), మజ్జి మహేంద్ర స్కూటీపై మంగళవారం వెళ్లారు. తిరిగి అదేరోజు రాత్రి స్వగ్రామం బయలుదేరారు. వీరిని గన్నెల జంక్షన్ వద్దకు వచ్చేసరికి కోళ్ల వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో బాలసూర్యం సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహేంద్రను అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి పోలీసులు తీసుకువెళ్లారు. ప్రమాదానికి కారణమైన కోళ్ల వ్యాన్ డ్రైవర్, క్లీనర్ వ్యాన్‌తో పరారయ్యారు. అనంతగిరి మండలం డముకు సమీపంలో మృతుడు బాలసూర్యం పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ గోపాలరావు పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన ఏకలవ్య పాఠశాల విద్యార్థిని మౌనిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బోర్నగూడెం విద్యార్థి సత్యనారాయణను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీలు

రాజవొమ్మంగి: స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో గిరిజన విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.మౌనిక వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేట్‌లో ద్వితీయ స్థానం సాధించింది. గుడివాడలో ఈనెల 15న జరిగిన ఈ పోటీల్లో అండర్-19 విభాగంలో ఉత్తమ ప్రతిభకనబర్చినట్టు ప్రిన్సిపాల్ ఎం.వి.కృష్ణారావు చెప్పారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని మౌనిక, ట్రైనర్ మాణిక్యాలరావును ప్రిన్సిపాల్ కృష్ణారావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో (స్పోర్ట్స్ స్కూల్) 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మోడిద సత్యనారాయణ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం రమేష్‌బాబు తెలిపారు. బిర్సా ముండా జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఇటీవల రంపచోడవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థి ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థి సత్యనారాయణను హెచ్ఎం రమేష్‌బాబుతో పాటు ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, కోటేశ్వర్రావు వరప్రసాద్, గంగన్నదొర, విశ్వనాథరెడ్డి, విజయబాబు తదితరులు అభినందించారు.

విజృంభిస్తున్న చలిగాలులు



చింతపల్లిలో చలి మంట కాగుతున్న గిరిజనులు



చింతపల్లి ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు అధికమయ్యాయి,. సాయంత్రం 4గంటల నుంచే ప్రజలను చలిగాలులు వణికిస్తున్నాయి,.రాత్రి సమయంలో చలిపులి మరింత విజృంభిస్తున్నాయి. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9.30 గంటల వరకు మంచుతెరలు వీడడం లేదు. సూర్యోదయం అయ్యేంత వరకు ప్రజలు చలితో గజగజ వణుకుతున్నారు. పాడేరు మండలం మినుములూరు 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలితో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శీతల గాలులతో మన్యం వాసులు వణికిపోతున్నారు. రెండు రోజులుగా ఈ ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయని స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్. వాతావరణ విభాగం నోడల్ అధికారి అప్పలస్వామి తెలిపారు. బుధవారం అరకులోయలో 8.8 డిగ్రీలు, చింతపల్లిలో 11.5 డిగ్రీలు, పాడేరులో 12.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు. గూడెం కొత్తవీధిలో 10.6 డిగ్రీలు, డుంబ్రిగుడలో 9.2, జి.మాడుగులలో 9.4, ముంచంగిపుట్టులో 10.3, హుకుంపేటలో 11.8, పెదబయలులో 11.7, అనంతగిరిలో 11.0, కొయ్యూరులో 14.5 డిగ్రీలు నమోదు అయ్యాయని ఏడీఆర్ వెల్లడించారు.

అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులను నిలదీస్తున్న ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజుబాబు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజావేదిక బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి పనుల్లో అనేక అక్రమాలు జరిగాయని ఇందుకు బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవరాపల్లి పంచాయతీ గూనవాయిలంకలో రోడ్డు నిర్మిచకుండానే బిల్లులు చేశారని ఆరోపించారు. దీనిపై ఎంబుక్ చేయలేనట్టు అధికారులు చెబుతున్నారన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు చేసే అధికారుల పట్ల ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.జేఏసీ కన్వీనర్ బలరాం, దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, రామారావు, రామకృష్ణ, శాంతిబాబు, రామారావు, సంతోష్, కృష్ణ, ఉపాధి పథకం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జీతాల కోసం నినదించిన 'ఉక్కు' మహిళలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాల కోసం వారి కుటుంబసభ్యులు రోడ్డెక్కారు. మహిళలు, చిన్నారులు కొవ్వొత్తులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఏడాదిగా రెండు విడతలుగా జీతాలు చెల్లించేవారు. రెండు నెలలుగా అవి కూడా సక్రమంగా ఇవ్వకుండా వేధిస్తున్నారు. సెప్టెంబర్‌కు చెందిన సగం జీతం పెండింగ్‌లో ఉండగా.. అక్టోబర్ జీతం 65 శాతం పెండింగ్ పెట్టారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు ఈఎంఐలు, స్కూల్ ఫీజులు, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున బుధవారం సాయంత్రం ఉక్కు అమరవీరుల కూడలి నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు, అక్కడి నుంచి తిరిగి అమరవీరుల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్‌లు మహిళల ర్యాలీకి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు పి.శిరీష, ఎన్.భారతి, ఎం.నవ్య, సుజాత, వరలక్ష్మి, లక్ష్మి, సుభాషిణి, వేణు పాల్గొన్నారు.